
మెదక్ మున్సిపాలిటీ: మెదక్‌లోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్


తూప్రాన్‌లోని ప్రభుత్వ కళాశాల వద్ద పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్


మెదక్ మున్సిపాలిటీ: పరీక్షా కేంద్రాల వద్ద తనిఖీలు నిర్వహించి లోపలికి అనుమతిస్తున్న పోలీసులు

# సజావుగా గ్రూప్-3 పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 54.27 శాతం హాజరు
- పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 17: జిల్లాలో గ్రూప్-3 పరీక్ష సజావుగా నిర్వహించారు. అభ్యర్థుల గుర్తింపు కార్డులు చెక్ చేసిన తరువాతే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. జిల్లా కేంద్రంలోని గీతా పాఠశాలలో ఆలస్యంగా వచ్చిన ముగ్గురు అభ్యర్థులను అధికారులు అనుమతించకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. జిల్లాలో 19 పరీక్షా కేంద్రాల్లో 5,867 మంది అభ్యర్థులకు పేపర్-1కు 3,187 మంది, (54.32శాతం), పేపర్-2కు 3,184 మంది (54.25 శాతం) హాజరయ్యారు.

**పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో సదుపాయాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లకు సూచించారు.

**కాళ్లు మొక్కినా కనికరించలే..**

రామాయంపేట, నవంబర్ 17: ప్రభుత్వం విధించిన నిమిషం నిబంధనను కఠినంగా అమలు చేశారు. సమయం ముగిసిన తర్వాత వచ్చిన అభ్యర్థులను పోలీసులు లోనికి రానీయలేదు. ముగ్గురు అభ్యర్థులను గేటు నుంచి వెనక్కి పంపించారు. ఓ అభ్యర్థిని తాను నారాయణఖేడ్ నుంచి వచ్చానని, తనకు అనుమతినివ్వాలని పోలీసుల కాళ్లు మొక్కింది. అయినా పంపలేదు. ఆమెను ఇక్కడి నుంచి వెళ్లి పోవాలని పోలీసులు బతిమిలాడారు. వినకపోవడంతో అక్కడి నుంచి మహిళా పోలీసులు బయటకు లాక్కొచ్చి అక్కడ నుంచి పంపించివేశారు.

**చంటి బిడ్డతో పరీక్షలకు..**

నిజామాబాద్ జిల్లా బిచ్కుంద గ్రామం నుంచి ఓ అభ్యర్థిని తన చంటి బిడ్డను తీసుకుని పరీక్ష రాయడం కోసం తల్లితో రామాయంపేటకు వచ్చింది. పరీక్షా కేంద్రానికి చేరుకుని తనబిడ్డను తల్లికి అప్పగించి పరీక్ష రాయడం కోసం కేంద్రానికి వెళ్లి పరీక్ష రాసింది. మూడు గంటల పాటు చంటిబిడ్డను తల్లి పట్టుకుని ఓ చెట్టు నీడన డబ్బా పాలు పట్టింది.

**తూప్రాన్‌లో అదనపు ఎస్పీ మహేందర్**

తూప్రాన్, నవంబర్ 17: తూప్రాన్ పట్టణంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో నిర్వహించిన పరీక్షకు 39.75 శాతం మంది హాజరయ్యారు. ఈ కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి ఉన్నారు.


రామాయంపేట: ఆలస్యం కావడంతో కేంద్రంలోకి పంపాలని పోలీసుల కాళ్లు మొక్కుతున్న అభ్యర్థిని శాంత


మెదక్ మున్సిపాలిటీ: పరీక్షా కేంద్రం లోపల హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న అభ్యర్థులు


రామాయంపేట: పరీక్షా కేంద్రం వద్ద తన బిడ్డను తల్లికి ఇచ్చి పరీక్ష రాయడానికి వెళ్తున్న అభ్యర్థిని

## ఇంటి నుంచి వెళ్లి.. చెరువులో శవమై..


ప్రభాకర్ (ఫైల్)

వెల్దుర్తి, నవంబర్ 17: మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి చెరువులో శవమై తేలిన ఘటన వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లోని కొప్పుల పల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. వెల్దుర్తి ఏఎస్సై సాదత్ తెలిపిన వివరాల ప్రకారం.. కొప్పుల పల్లి గ్రామానికి చెందిన గెంట్యాల ప్రభాకర్ (35) ఫ్లెక్సీ ప్రింటింగ్ పని చేస్తుండేవాడు. ఈ నెల 14న ప్రింటింగ్ పని ఉన్నదని ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. 15న ఉదయం తల్లి చంద్రమ్మ ఫోన్ చేసినా కలవలేదు. దీంతో బంధువులు, తెలిసిన వ్యక్తులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన పలువురు ఊరచెరువులో మృతదేహం కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. చెరువులో కనిపించిన మృతదేహం ప్రభాకర్‌దేనని కుటుంబ సభ్యులు గుర్తించారు. విషయం తెలుసుకున్న వెల్దుర్తి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. తల్లి చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పాత కక్షలతో వ్యక్తి దారుణ హత్య


ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై సుభాష్‌గౌడ్

మనోహరాబాద్, నవంబర్ 17: పాత కక్షలతో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రమోద్ పాశ్వాన్, బిట్టు ఆరు నెలలుగా మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో ఓ ఇంటి పని నిర్మాణానికి వచ్చి ఇక్కడే ఉండి కూలి పనులు చేసుకుంటున్నారు. శనివారం రాత్రి పాత కక్షలను మనసులో పెట్టుకొని బిట్టు అనే వ్యక్తి ప్రమోద్ పాశ్వాన్ని (41) కట్టెతో తలపై తీవ్రంగా గాయపరిచి హత్య చేశాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుభాష్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించా రు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: డీఎస్పీ


కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

నిజాంపేట, నవంబర్ 17: ధాన్యం కొనుగోలులో సమస్యలు ఏర్పడితే, పరిష్కారాలకు కృషి చేస్తామని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం చల్మెడలోని తిరుమల నాథ స్వామి ఆలయంలో రామాయంపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని డీఎస్పీ సందర్శించారు. కార్యక్రమంలో సీఐ వెంకటరాజగౌడ్, నిజాంపేట ఏఎస్సై జైపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తుమ్మల రమేశ్, రైతులు ఉన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


కోమటిపల్లి పెద్ద చెరువులో చేపలు వదులుతున్న మత్స్యకార సంఘం సభ్యులు

రామాయంపేట, నవంబర్ 17: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని మత్స్యకార సంఘం మండల అధ్యక్షుడు తొంటవల్లి యాదగిరి, పీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు, మాజీ ఎంపీపీ ఏసు గారి రమేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం రామాయంపేట పురపాలికలోని కోమటిపల్లి పెద్ద చెరువులో చేప పిల్లలు వదిలారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుందర్‌సింగ్, సాదుల పరశురాములు, శ్రీనివాస్, యాదగిరి, మహేశ్, ఎర్రం చంద్రం, తొనిగండ్ల హనుమంతు తదితరులు ఉన్నారు.

## ఉద్యమకారుడి మృతి పార్టీకి తీరనిలోటు

**- మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**


పాపన్నపేట: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

పాపన్నపేట, నవంబర్ 17: తెలంగాణ ఉద్యమకారుడు చామంతుల రమేశ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆమె మండలంలోని యూసూఫ్‌పేటకు చేరుకుని రమేశ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఆమె వెంట మాజీ సర్పంచులు శ్రీనాథ్‌రావు, ఎర్పుల దాసయ్య, మాజీ ఎంపీటీసీ నిరుడి జ్యోతి, సాయిలు ఉన్నారు.

**బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ**

చిన్నశంకరంపేట, నవంబర్ 17: మండలంలోని గవ్వలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సుధాకర్ తల్లి దుర్గమ్మ మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు సోములు, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, నరసింహారెడ్డి, నాగరాజు, గోవర్ధన్‌రెడ్డి, చంద్రం, శ్రీను,యాదగిరి, ఆంజనేయులు, సత్యనారాయణ, ప్రభాకర్, నవీన్‌రెడ్డి, రాజశేఖర్, నరేశ్, సాయి తదితరులున్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

## నత్నాయిపల్లిలో నీటి కటకట


నీటిని తీసుకెళ్తున్న మహిళలు

నర్సాపూర్, నవంబర్ 16: మహిళలు బిందెలు పట్టుకుని రోడ్డు మీదకు రాకూడదనే ముఖ్య ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మిషన్ భగీరథతో ఇంటింటికీ నీటిని అందిస్తూ మహిళల నీటి గోసను గత ప్రభుత్వం తీర్చింది. కానీ నేడు పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. నల్లాల్లో నీళ్లు రాక మహిళలు బోర్లను ఆశ్రయించాల్సి వస్తున్నది. మండలంలోని నత్నాయిపల్లి గ్రామంలో మూడు రోజుల నుంచి తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. మిషన్ భగీరథ నీరు రాక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. వాటర్ ట్యాంక్‌లోకి నీటిని సరఫరా చేసే బోరు మోటర్ చెడిపోయింది. పట్టించుకునే నాథుడు లేక మహిళలు బిందెలు తీసుకుని పొలాల్లోని బోర్ల వద్ద నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. గ్రామంలో నీరు రాకపోవడంతో పక్క గ్రామలైన కాగజ్‌మద్దూర్, షేర్‌ఖాన్‌పల్లి గ్రామాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. మోటర్‌ను బాగుచేయాలని అధికారుల అడిగితే పంచాయతీలో బడ్జెట్ లేదని సమాధానం చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పంచాయతీ సెక్రటరీ సంగీతను వివరణ కోరగా వాటర్ ట్యాంక్‌లోకి నీటిని సరఫరా చేసే మోటర్, పంపు కాలిపోయిందని, మోటర్ తీయడానికి కూలీలు దొరకక ఆలస్యం అయ్యిందని తెలిపారు. ఆదివారం మోటర్ తీయించామన్నారు.

## ఆలయాల్లో కార్తిక ఉత్సవాలు


పాపన్నపేట: భక్తులతో కిటకిటలాడుతున్న ఏడుపాయల


రామాయంపేట: నగరేశ్వర ఆలయంలో భక్తుల పూజలు

పాపన్నపేట, నవంబర్ 17: ఏడుపాయల ఆదివారం భక్తజనులతో కిక్కిరిసిసోయింది. అర్చకులు శంకర పార్థివశర్మ దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఒడిబియ్యం పోసి బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ సిబ్బంది పోలీసులు చర్యలు తీసుకున్నారు.

**ఏడుపాయల పాలకవర్గ ఏర్పాటుకు నోటిఫికేషన్**

ఏడుపాయల నూతన పాలకవర్గ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైట్లు ఈవో చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 20 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**రామాయంపేట దేవాలయాలలో పూజలు**

రామాయంపేట, నవంబర్ 17: పట్టణంలోని ఆలయాల్లో కార్తిక మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వామివారికి అభిషేకాలు, మంగళహారతులు, నైవేద్యాలు సమర్పించారు. భక్తులు దీపాలు వెలిగించి, స్వామివారిని పూలతో అలంకరించారు. మహంకాళి ఆలయంలో మహిళా భక్తులు అమ్మవారికి హారతులు ఇచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప ఆలయంలో మాలదారులు స్వాముల వారికి అభిషేకాలను చేశారు. నగరేశ్వర ఆలయంలో హోమాలు, నైవేద్యాలు, మంగళహారతులు సమర్పించారు. అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

### మండలి వైస్ చైర్మన్‌కు సన్మానం



నిజాంపేట, నవంబర్ 17: విదేశీ పర్యటన ముగించుకుని తిరిగొచ్చిన శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్‌ను ఆదివారం తన కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకుడు కాశబోయిన దయాకర్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు సదాశివగౌడ్, సాయగౌడ్ కలిసి, సన్మానించారు.

### ఎంపీని కలిసిన ట్రాన్స్‌కో డీఈ



మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 17: మెదక్ ట్రాన్స్‌కో డీఈగా బాధ్యతలు చేపట్టిన చాంద్ షరీఫ్ బాషా, మెదక్ ఎంపీ రఘునందన్‌రావును ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు.

### రోడ్డు ప్రమాదంలో బైక్ రైడర్ మృతి


ఘటనా స్థలంలో పోలీసులు
ఇన్‌సెట్‌లో కౌశిక్ కళ్యాణ్‌రెడ్డి (ఫైల్)

నర్సాపూర్, నవంబర్ 17: రోడ్డు ప్రమాదంలో బైక్ రైడర్ మృతి చెందిన ఘటన నర్సాపూర్ అటవీ ప్రాంతంలో ఆదివారం జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన అల్లం కౌశిక్ కళ్యాణ్‌రెడ్డి(19) అతని స్నేహితుడు సత్వెల్లి రుషిల్‌తో కలిసి బైక్ రైడింగ్ కోసం కూకట్‌పల్లి నుంచి జోగిపేట్‌కు రెండు బైక్‌లపై వచ్చారు. అనంతరం జోగిపేట్ నుంచి నర్సాపూర్‌కు వచ్చి అక్కడి నుంచి హైదరాబాద్ బయలుదేరారు. హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో కొండాపూర్ గ్రామ సమీపంలో అల్లం కౌశిక్ కళ్యాణ్‌రెడ్డి టీఎస్ 03ఎఫ్‌జి1771 నెంబర్ గల బీఎండబ్ల్యూ బైక్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో స్కిడ్ అయ్యి, రోడ్డుపై పడిపోయింది. ఎదురుగా వస్తున్న కార్ నెంబర్ టీఎస్08 జెపి 7889ని ఢీకొట్టింది. దీంతో కౌశిక్ కళ్యాణ్ రెడ్డి తల, కాళ్లు, ఛాతిపై తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి అల్లం సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

### బైక్‌ను ఢీకొన్న కారు

వెల్దుర్తి, నవంబర్ 17: వెనక నుంచి వేగంగా వచ్చిన కారు ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొన్న ఘటనలో వెల్దుర్తి తహసీల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెల్దుర్తి ఏఎస్సై సాదత్‌మియా తెలిపిన వివరాల ప్రకారం.. సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ శనివారం విధులు ముగించుకుని తూప్రాన్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. వెల్దుర్తి శివారు గంగమ్మ దేవాలయం సమీపంలో వెనక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు బైక్‌ను బలంగా ఢీకొనడంతో బైక్‌తో పాటు ప్రసాద్ కిందపడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన ప్రయాణికులు ప్రసాద్‌ను వెల్దుర్తిలోని ఓ ప్రైవేటు దవాఖానలో, అక్కడి ఉంచి మెదక్‌కు తరలించారు.

### హెల్మెట్ లేకుంటే జరిమానా తప్పదు

రామాయంపేట, నవంబర్ 17: హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే జరిమానా విధిస్తామని సీఐ వెంకటరాజాగౌడ్ అన్నారు. ఆదివారం తమ సిబ్బందితో సిద్దిపేట, మెదక్, గజ్వేల్ రోడ్ల వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలన్నారు. వాహనానికి సంబంధించిన అన్ని కాగితాలు ఉంచుకోవాలన్నారు. పిల్లలకు బైక్‌లు ఇచ్చినా జరిమానాలు, కేసులు తప్పవన్నారు.

## తునికి నల్ల పోచమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే


తునికి నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కౌడిపల్లి, నవంబర్ 17: మండలంలోని తునికి గ్రామంలో నల్ల పోచమ్మ అమ్మవారిని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి నాడు దర్శించుకున్నారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారి శివప్ప అభిషేకం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వెంకట్రావ్ పేట్ గ్రామానికి చెందిన వెంకటేశ్‌గౌడ్ కుమారుని పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారు. ఆమె వెంట నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమ్, మాజీ ఉప సర్పంచ్ కొండల్‌రెడ్డి, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ ప్రతాప్‌గౌడ్, నాయకులు అమర్‌సింగ్, శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్ ఉన్నారు.

## మెదక్ చర్చిలో భక్తుల సందడి


చర్చిని సందర్శించిన పాస్నెట్ కుటుంబ సభ్యులు

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 17: రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు తరలిరావడంతో మెదక్ చర్చి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులనుద్దేశించి దైవసందేశం వినిపించారు. యేసయ్య భక్తి గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్రార్థనల్లో డేవిడ్, శ్రీనివాస్, జైపాల్, కమిటీ సభ్యులు గంట సంపత్, జయరాజు సంశాన్ సందీప్, సువన్‌డగ్లస్, ఫ్రాంక్‌జాన్సన్, ప్రభుదాస్, దేవరాజ్ పాల్గొన్నారు.

**చర్చిలో పాస్నెట్ కుటుంబ సభ్యులు**

మెదక్ చర్చిని నిర్మాణ దాత చార్లెస్ వాకర్ పాస్నెట్ సోదరి ఇంగ్లాండ్‌కు చెందిన కుటుంబ సభ్యులు ఎలిజబెత్, జులియా, మైఖేల్, కారోల్, ఫ్రాంక్లిన్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్ ఆధ్వర్యంలో వారిని ఆహ్వానించి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. క్రిస్మస్ రెండు రోజుల ముందు పాస్నెట్ ముని మనువరాలు రానున్నట్లు గంట సంపత్ తెలిపారు.


మెదక్ చర్చి ఎదుట జనసందోహం

## తూప్రాన్‌లో 70 శాతం సర్వే పూర్తి: ఆర్డీవో


తూప్రాన్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో

తూప్రాన్, నవంబర్ 17: డివిజన్‌లో చేపట్టిన సర్వే 70 శాతం పూర్తైనట్లు ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. తూప్రాన్ మున్సిపాలిటీలో జరుగుతున్న సర్వేను ఆర్డీవో ఆదివారం పరిశీలించారు. డివిజన్‌లో 374 ఎన్యూమరేటర్లు సర్వే చేస్తుండగా, వీరిని 43 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. నార్సింగి మండలంలో 78.32 శాతం, చేగుంట మండలంలో 74.38 శాతం, తూప్రాన్ మున్సిపాలిటీలో 71.08 శాతం, మనోహరాబాద్ మండలంలో 71.40 శాతం, తూప్రాన్ మండలంలో 72.57 శాతం, మాసాయిపేట మండలంలో 65.87 శాతం, వెల్దుర్తి మండలంలో 57.90 శాతం కుటుంబాల సర్వే పూర్తైనట్లు తెలిపారు.

## వెంకటేశ్వర కాలనీ కమిటీ సభ్యుల ఎన్నిక



నర్సాపూర్, నవంబర్ 17: మున్సిపాలిటీలోని వెంకటేశ్వర కాలనీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా వై.సుధాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా అంజిరెడ్డి, నర్సింహులు, గుండం కిషన్, ప్రధాన కార్యదర్శిగా కల్లూరి ఆంజనేయులు, కోశాధికారిగా అశోక్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా శంకర్‌నాయక్, ప్రచార కార్యదర్శులుగా రాజు, చందర్, రమేశ్, మన్నె రవికుమార్, సలహాదారులుగా శ్రీనివాస్, సత్యనారాయణ, యాదగిరి, బుచ్చానాయక్, కార్యవర్గ సభ్యులుగా నవీన్, శ్రీధర్, అశోక్, శ్రీనివాస్, వెంకాగౌడ్, ప్రభాకర్, సంతోష్, మల్లేశ్, విఠల్, రాజు చందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657